క్లుప్తంగా

రాష్ట్రస్థాయి కళా ఉత్సవ్ పోటీలకు జాన్‌వెస్లీ



హసన్‌పర్తి: రాష్ట్రస్థాయి కళా ఉత్సవ్ –2025 పోటీలకు హసన్‌పర్తిలోని పీఎంశ్రీ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి జాన్‌వెస్లీ ఎంపిక య్యాడు. ఇటీవల నగరంలో నిర్వహించిన జిల్లాస్థాయి కళా ఉత్సవ్ (వాయిద్య పరికరాలు స్ట్రింగ్ సో) విభాగంలో పాల్గొని రాష్ట్రస్థాయికి అర్హత సాధించినట్లు ప్రధానోపాధ్యాయురాలు సుమాదేవి తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో సోమవారం జరిగిన సమావేశంలో ఆ విద్యార్థిని ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ



కాజీపేట: తెలంగాణ రాష్ట్రస్థాయి అస్మిత ఖేలో ఇండియా మహిళా లీగ్–1, లీగ్–2 వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన సింధు.. గోల్డ్ మెడల్, కీర్తన బ్రాంజ్ మెడల్ సాధించారు. 44 కిలోల విభాగంలో సింధు, 77 కిలోల విభాగాల్లో కీర్తన బ్రాంజ్ మెడల్ దక్కించుకున్నారు. వారికి జిల్లా టీం మేనేజర్, కోచ్ రాధిక మల్లేష్ మార్గదర్శకం చేశారు. క్రీడాకారులకు మంత్రి భట్టి విక్రమార్క సతీమణి నందిని సోమవారం బహుమతులు ప్రదానం చేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాడు శ్రుతిరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు మండలోజు కృష్ణమూర్తి, ఖ్యాతి, మధుసూదన్, సుధాకర్, వినోద్, నాగరాజు, రవిప్రకాష్, హనుమంతరాజు తదితరులు పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్ జయరాజ్‌కు ఎన్టీఆర్ నేషనల్ అవార్డు



మడికొండ: మడికొండ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న జయరాజ్‌కు నందమూరి తారక రామారావు అవార్డును మదర్ సర్వీస్ సొసైటీ విజయవాడ ఆధ్వర్యంలో సోమవారం అందజేశారు. వ్యవస్థాపకుడు మల్లాది ప్రసాద్ రావు, సినిమా ఆర్టిస్టులు పృథ్వీరాజు, రజితసిండే చేతుల మీదుగా అవార్డును విజయవాడలో అందుకున్నట్లు జయరాజ్ తెలిపారు.

రేపు 'ఉత్తమ టీచర్ల'కు సన్మానం

ఖిలా వరంగల్: ఈనెల 17న రంగశాయిపేటలోని బిర్లా ఓపెన్ మైండ్ స్కూల్ ప్రాంగణంలో ప్రైవేట్ ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వరంగల్ జిల్లా ట్రస్మా, వడుప్సా గౌరవ అధ్యక్షుడు ఆడెపు శ్యామ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేట్ ప్రైమరీ నుంచి హైస్కూల్ వరకు ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపికచేసి అభినందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ముఖ్యఅతిథులుగా వరంగల్ డీఈఓ, ఎంఈఓలు, ట్రస్మా రాష్ట్ర నాయకులు హాజరవుతున్నారని, ప్రైవేట్ స్కూల్ ఉపాధ్యాయులు హాజరై సన్మానోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆడెపు శ్యామ్ కోరారు.

సమస్యలు పరిష్కరించాలని సీఎం రేవంత్‌రెడ్డికి వినతి



హన్మకొండ అర్బన్: రేషన్ డీలర్లకు గౌరవ వేతనం అమలుతో పాటు కమీషన్ పెంచాలని, సమస్యలను పరిష్కరించాలని రేషన్ డీలర్లు కోరారు. ఈ మేరకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బత్తిని రమేష్‌బాబు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెడ్డిమల్ల హనుమండ్లు, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మహేశ్వరం గౌరీశంకర్, తదితరులు పాల్గొన్నారు.

వడ్డెరుల సమస్యలు పరిష్కరించాలని..

కాజీపేట: తమ సమస్యలు పరిష్కరించాలని జిల్లాకు చెందిన వడ్డెర కుల సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డితో కలిసి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పల్లపు సమ్మయ్య మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వడ్డెర కులస్తులు పనులు లేక అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డేరంగుల బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

మీ సేవ.. మరింత చేరువ

- కొత్తగా మరిన్ని సేవలకు అనుమతి
- కుల ధ్రువీకరణ పత్రం ఎప్పుడైనా.. ఎక్కడి నుంచైనా తీసుకునే వెసులుబాటు

కాజీపేట: ప్రజాపాలన మరింత పారదర్శకంగా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. మీ సేవ కేంద్రాల ద్వారా ఆయా ప్రభుత్వ కార్యాలయాల సేవలను అందిస్తోంది. వ్యవసాయ, రెవెన్యూ, మున్సిపల్, రవాణా, పౌరసరఫరాల, విద్యుత్, దేవాదాయ, కార్మిక, పోలీస్ తదితర శాఖల సేవలను ఆన్‌లైన్ ద్వారా అందిస్తోంది. కొత్తగా మరిన్ని సేవలను ప్రజలకు అందించాలనే సంకల్పంతో మరిన్ని సేవలను అదనంగా పొందుపర్చింది. దీంతో ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ కానున్నాయి.

పాన్‌కార్డులో మార్పులు, చేర్పులు

ప్రస్తుతం చాలా మంది ప్రజలు తమ పాన్‌కార్డుల్లో తప్పులు దొర్లడంతో వాటి మార్పులు, చేర్పుల కోసం సరైన సమాచారం లేక ఇబ్బందులు పడుతున్నారు. ఎలా చేసుకోవాలో తెలియక నానా హైరానా పడుతున్నారు. పాన్‌కార్డు కేంద్రాల చుట్టూ తిరిగి వేసారిపోతున్నారు. ప్రభుత్వం కొత్తగా మీసేవ ద్వారానే పాన్‌కార్డులో మార్పులు చేర్పులు చేసుకునే వెసులుబాటు కల్పిస్తూ ఆదేశాలు జారీ చేసింది. దాంతో అలాంటి సమస్యలతో బాధపడుతున్న వారికి సమీపంలోనే పరిష్కారం దొరికింది.

ఎప్పుడైనా.. ఎక్కడైనా..

ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు ఇతర వాటి కోసం దరఖాస్తు చేసుకునేందుకు రెండు, మూడు రోజుల్లోనే నూతన తేదీలతో కుల ధ్రువీకరణపత్రం సమర్పించాల్సి ఉంటుంది. అలాంటి సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటుంటారు. తాజాగా తమ కుల ధ్రువీకరణపత్రాల కోసం ఒక్కసారి దరఖాస్తు చేసుకుంటే తహసీల్దార్ మంజూరు చేస్తే చాలు. దాని ద్వారా ఎప్పుడైనా, ఎక్కడైనా, ఎన్నిసార్లు అయినా దరఖాస్తుదారుడు ఆ ధ్రువపత్రాన్ని పొందవచ్చు. ఈ అవకాశాన్ని ప్రభుత్వం నూతనంగా మీసేవలో పొందుపరిచింది. పాతది జత చేసి మీసేవలో దరఖాస్తు చేసుకుంటే వెంటనే కొత్త తేదీలతో ధ్రువపత్రం జారీ చేస్తారు.

అటవీ శాఖకు సంబంధించి..

అటవీ జంతువుల దాడిలో చనిపోయిన మనుషులు, పశువులకు పరిహారం కోసం దరఖాస్తులు, కర్ర మిల్లులు, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ నుంచి సీనియర్ సిటిజన్ మెయింటెనెన్స్, మానిటరింగ్ సిస్టం దరఖాస్తులు వంటివి మీ సేవలో ప్రభుత్వం పొందుపర్చింది. ప్రజలు తమకు కావాల్సిన పత్రాల కోసం దరఖాస్తు సమర్పిస్తే చాలు నిర్ణీత సమయంలోనే ధ్రువ పత్రాలు పొందవచ్చు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 16న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. హనుమకొండ చౌరస్తా, కాకాజీ కాలనీ, అశోక జంక్షన్, టైలర్ స్ట్రీట్, జేఎన్ స్టేడియం, కాకతీయ డిగ్రీ కళాశాల ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, సాయి నగర్, బాలసముద్రం, రాంనగర్, గోకుల్‌నగర్, లష్కర్ బజార్ మెయిన్ రోడ్డు, పబ్లిక్ గార్డెన్, లష్కర్ బజార్ ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు, లష్కర్‌బజార్, ప్రసూతి ఆస్పత్రి, లష్కర్‌బజార్ మెయిన్ రోడ్డు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే, వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. డాక్టర్స్ కాలనీ, దేశాయిపేట రోడ్డు, ఫిల్టర్ బెడ్ రోడ్డు, పుప్పాల గుట్ట, ఏసీ.రెడ్డి నగర్, రైల్వే ట్రాక్, ఆరోగ్య కేంద్రం, మసీదు, గంగదేవి హోటల్ ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మిల్స్ కాలనీ పోలీసు స్టేషన్, తహసీల్దార్ కార్యాలయం, ఏఎస్ఎం కళాశాల, రంగశాయిపేట, ఎల్లమ్మ తాళ్లు, వాటర్ ట్యాంక్, గుండు మైసమ్మ, రుద్రమాంబ ప్రాంతం, భారతి డిగ్రీ కళాశాల రోడ్డు, 80 ఫీట్ రోడ్డు, కొత్తవాడ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సాయుధ పోరాటాన్ని వక్రీకరిస్తున్నారు

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాస్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

న్యూశాయంపేట: తెలంగాణ విలీన దినోత్సవంపై మాట్లాడే హక్కు బీజేపీకి లేదని, సాయుధ పోరాట చరిత్రను పాలకులు వక్రీకరిస్తున్నారని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి టి.శ్రీనివాస్‌రావు విమర్శించారు. ఈ నెల 11 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా సోమవారం వరంగల్‌లోని అబ్బూస్ ఫంక్షన్ హాల్‌లో సాయుధ పోరాట వారోత్సవాల సభను నిర్వహించారు. తొలుత పోచమ్మ మైదాన్‌లోని చెన్నబోయిన కమలమ్మ, అప్పన్న విగ్రహాలకు నివాళులర్పించి పోచమ్మ మైదాన్ నుంచి ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాషుమియా అధ్యక్షతన జరిగిన సభలో నాయకులు వెంకట్రాములు, మేకల రవి, కరుణాకర్, లక్ష్మణ్, రమేష్, రవీందర్, భద్రీ, చెన్నకేశవులు, శరత్, సుధీర్ పాల్గొన్నారు.

భూముల రక్షణలో అధికారుల నిర్లక్ష్యం



నిరసన తెలుపుతున్న నాయకులు

హన్మకొండ అర్బన్: జిల్లాలో రూ.వందల కోట్ల ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురవుతున్నా అరికట్టడంలో అధికారులు విఫలమవుతున్నారని హనుమకొండ జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి కర్రె లక్ష్మణ్ విమర్శించారు. జిల్లా సమితి ఆధ్వర్యంలో హనుమకొండ కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐనవోలు, కాజీపేట, హసన్‌పర్తి, హనుమకొండ మండలాల పరిధిలో సుమారు రూ.200 కోట్ల విలువైన ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. పేదవాడు నిలువ నీడ కోసం 60 గజాల జాగాలో గుడిసె వేసుకుంటే అది చట్టవిరుద్ధమని కేసు పెట్టే అధికార యంత్రాంగం.. కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములు ఆక్రమించుకుంటున్న వారిపై ఎందుకు చర్యలు తీసుకోవట్లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఏదునూరి వెంకట్రాజం, జిల్లా అధ్యక్షుడు మునిగాల భిక్షపతి, సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, నాయకులు రాజయ్య, రాజు, భిక్షపతి, ప్రవీణ్, పద్మ, బాబు, వెంకటయ్య, భాగ్య, సునీల్, లక్ష్మి, స్వరూప, మహేందర్, శిరీష, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ మండల స్థాయి ఎంపిక క్రీడోత్సవాలు

విద్యారణ్యపురి: 69వ ఎస్‌జీఎఫ్ హనుమకొండ మండల స్థాయి ఎంపిక క్రీడోత్సవాలను నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖాధికారి నెహ్రూ నాయక్, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ పీడీ కరుణాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 14, 17 బాలబాలికలకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలు ఈనెల 17, 18వ తేదీల్లో హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ హైస్కూల్‌లో నిర్వహించనున్నామని తెలిపారు. అండర్ –17 బాలబాలికలు 2009, జనవరి 1 తర్వాత జన్మించిన వారై ఉండాలని పేర్కొన్నారు. వారికి ఈ నెల 17న క్రీడాపోటీల ఎంపికలు జరుగుతాయని తెలిపారు. అండర్ –14 బాలబాలికలు 2012, జనవరి 1 తర్వాత జన్మించిన వారై ఉండాలని పేర్కొన్నారు. వారికి ఈనెల 18న పోటీలు జరుగుతాయని తెలిపారు. వివరాలకు 73960 51876 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలని నిరసన



హనుమకొండ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న జర్నలిస్టు సంఘం నాయకులు

హన్మకొండ అర్బన్: ఉమ్మడి ఖమ్మం జిల్లా ఓ టీవీ స్టాఫ్ రిపోర్టర్‌పై పెట్టిన అక్రమ కేసును వెంటనే ఎత్తివేయాలని టీయూడబ్ల్యూజే (హెచ్ –143) జిల్లా కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు హనుమకొండ కలెక్టరేట్ ఎదుట జర్నలిస్టులు నల్ల బ్యాడ్జీలు ధరించి ప్లకార్డులు ప్రదర్శిస్తూ సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూరియా సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చే ప్రయత్నం చేసిన జర్నలిస్టుపై పోలీసులు నిరంకుశంగా నాన్ బెయిలబుల్ కేసులు పెట్టడం శోభనీయమన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బీఆర్ లెనిన్, జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి అర్షం రాజ్‌కుమార్, నాయకులు వేణు, రవికాంత్, సత్యనారాయణ, ఆదర్శ, రాజేందర్, గొట్టె వెంకన్న, ప్రశాంత్, కృష్ణ పాల్గొన్నారు.

బల్దియా ప్రధాన కార్యాలయం ఎదుట..

వరంగల్ అర్బన్: జర్నలిస్టులపై అక్రమ కేసులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఎత్తివేయాలని టీయూడబ్ల్యూజే (143) వరంగల్ జిల్లా అధ్యక్షుడు కోరుకొప్పుల నరేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బల్దియా ప్రధాన కార్యాలయంలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట సోమవారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు మిట్ట నవనీత్, జిల్లా ప్రధాన కార్యదర్శి వాంకే శ్రీనివాస్, కోశాధికారి రాపల్లి ఉపేందర్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రధాన కార్యదర్శి నీలం శివ, కమటం వేణుగోపాల్, ప్రతినిధులు భూసారపు వెంకన్న, వనం భాస్కర్, అమీర్, వేశాల పూర్ణచందర్, రాయల ప్రభాకర్, నీలకంఠం పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎర్రబెల్లి ప్రదీప్‌రావు

ఖిలా వరంగల్: ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు నిర్వహించనున్న సేవా పక్షం కార్యక్రమాలను విజయవంతం చేయాలని బీజేపీ నేత డాక్టర్ వెంకటరమణ, వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు పిలుపునిచ్చారు. ఖిలా వరంగల్ పడమర కోటలోని ముదిరాజ్ భవనంలో సోమవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కుసుమ సతీష్, సిద్దం నరేష్, కందిమల్ల మహేష్, సంగీత్, చంద్రమోహన్, అంకాల జనార్దన్, వాసుదేవ్, రాజ్‌కుమార్, అర్జున్ గౌడ్, కర్నె రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కేడీసీలో హిందీ దివస్

విద్యారణ్యపురి: కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిందీ విభాగం ఆధ్వర్యంలో సోమవారం హిందీ దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, పోస్టర్ ప్రజెంటేషన్, పాటలు, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ గుర్రం శ్రీనివాస్, అధ్యాపకులు బహుమతులు ప్రదానం చేశారు.

19న మెగా జాబ్‌మేళా

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మెగాజాబ్ మేళా రిక్రూట్‌మెంట్ కోసం విద్యార్థులకు సాఫ్ట్ స్కిల్స్, ఇంటర్వ్యూ నైపుణ్యాలపై శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి, ప్లేస్‌మెంట్ సెల్ ఆఫీసర్ డాక్టర్ జితేందర్ తెలిపారు. ఈ నెల 16నుంచి 18వ తేదీ వరకు శిక్షణ తరగతులు, 19న మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ వివరించారు.

సంక్షిప్తంగా

ప్రభుత్వం ఇకనైనా స్పందించాలి

కేయూ క్యాంపస్: చాలీచాలని వేతనాలతో ఉద్యోగ భద్రత లేకుండా విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న పార్ట్‌టైం అధ్యాపకుల మరణాలను చూసైనా ప్రభుత్వం స్పందించాలని కేయూ పార్ట్‌టైం అధ్యాపకుల సంఘం కేయూ అధ్యక్షుడు డాక్టర్ రాంబాబు కోరారు. కాకతీయ యూనివర్సిటీ సెరీకల్చర్ విభాగానికి చెందిన పార్ట్‌టైం అధ్యాపకుడు తిరుపతి, తెలంగాణ యూనివర్సిటీ హిస్టరీ విభాగానికి చెందిన పార్ట్‌టైం అధ్యాపకుడు రమేష్ ఇటీవల గుండెపోటుతో మరణించారని తెలిపారు. కాకతీయ యూనివర్సిటీ పరిపాలన భవనం వద్ద ఆ అధ్యాపకుల సంతాప సభను సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్ట్‌టైం అధ్యాపకుల సంఘం కేయూ ప్రధాన కార్యదర్శి నరేందర్ నాయక్, బాధ్యులు డాక్టర్ తిరుణహరి శేషు, బ్రహ్మయ్య, దేవోజీ నాయక్, బాలు, భిక్షపతి, కిరణ్, కృష్ణ, సుమంత్, వీఎస్ నరేందర్ పాల్గొన్నారు. పార్ట్‌టైం అధ్యాపకుల అభ్యర్థన మేరకు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం సంతాపం తెలిపారు.

టీజీపీఎస్సీ బోర్డును రద్దుచేయాలి

కేయూ క్యాంపస్: రాష్ట్రంలో గ్రూప్ –1 మెయిన్స్ ఫలితాలను రద్దు చేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు అని, వెంటనే టీజీపీఎస్సీ బోర్డును రద్దు చేయాలని ఎంఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతి మాదిగ డిమాండ్ చేశారు. కాకతీయ యూనివర్సిటీ గెస్ట్ హౌస్ వద్ద సోమవారం నిర్వహించిన సమావేశంలో ఎంఎస్ఎఫ్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి ముక్కెర ముఖేష్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు చింతం సిద్దు, కేయూ అధ్యక్షుడు కుమ్మరి శ్రీనాథ్, బాధ్యులు మారెపెల్లి రాణాప్రతాప్, అడ్లూరి గణేష్, సూర్యప్రకాశ్, పార్థు, కార్తీక్, సూర్యప్రకాశ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

జాతి నిర్మాతలు ఉపాధ్యాయులు

హసన్‌పర్తి: జాతి నిర్మాతలు ఉపాధ్యాయులని గోపాలపురం స్టార్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.పూర్ణాచారి కొనియాడారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం చెంచుపల్లికి చెందిన దుస్స సుధాకర్, మొగుళ్లపల్లికి చెందిన దాసరి రాజేంద్రప్రసాద్‌తో పాటు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు పొందిన అబ్బోజు కిరణ్‌కుమార్‌ను గోపాలపురంలో ఆదివారం రాత్రి ఘనంగా సన్మానించారు.

ఉత్తమ టీచర్ అవార్డు గ్రహీతకు సన్మానం

విద్యారణ్యపురి: ఇటీవల రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న హనుమకొండ లష్కర్ బజార్ బాలికల ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు సీహెచ్ రాములును హనుమకొండలోని ప్రభుత్వ మర్కజీ హైస్కూల్‌లో సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో ప్రభుత్వ టీచర్స్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరి, ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి, బాధ్యులు వెంకటేశం, కాసం ప్రభాకర్, సైదులు రెడ్డి, కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్ఎంలకు మినహాయింపు ఇవ్వాలి

హన్మకొండ అర్బన్: వైద్యారోగ్యశాఖలో పనిచేస్తున్న ఏఎన్ఎంలకు అసంక్రమిత వ్యాధుల (ఎన్‌సీడీ) స్క్రీనింగ్ పరీక్షల పని నుంచి మినహాయింపు ఇవ్వాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ అనుబంధ) రాష్ట్ర కార్యదర్శి జిల్లపెల్లి సుధాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా హనుమకొండ కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డిని సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి

హసన్‌పర్తి: కిట్స్ – అంబాల మార్గమధ్యలోని దత్తత్రేయ కాలనీలో కనీస సౌకర్యాలు కల్పించాలని స్థానికులు కోరారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజుకు సోమవారం వినతి పత్రం అందించారు. కార్యక్రమలో కాలనీ అధ్యక్షుడు వీసం విజేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి జయప్రకాష్, స్థానికులు శ్రీనివాస్‌రావు, లక్ష్మణ్, వీసం సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల బాధ్యులు

కేయూ క్యాంపస్: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని కేయూలోని ఐక్య విద్యార్థి సంఘాల బాధ్యులు, పరిశోధకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కాకతీయ యూనివర్సిటీలోని గెస్ట్ హౌస్ వద్ద సోమవారం ఏర్పాటు చేసిన ఆయా సంఘాల సమావేశంలో బాధ్యులు మాట్లాడారు. కేయూలో వరుస గొడవలతో విద్యార్థులు మానసికంగా ఇబ్బందులు పడుతున్నారని, యూనివర్సిటీ అధికారులు స్పందించి ప్రశాంత వాతావరణం కల్పించాలని కోరారు. సమావేశంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆరెగంటి నాగరాజు, రీసెర్చ్ స్కాలర్స్ తిరుపతి, కేతపాక ప్రసాద్, శ్రీదేవి, ఏఐడీఎస్ఓ రాష్ట్ర కన్వీనర్ సత్యనారాయణ, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మర్రి మహేష్, ఎస్ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎల్తూరి సాయికుమార్, డీఎస్‌ఏ హనుమకొండ జిల్లా కన్వీనర్ ఉప్పుల శివ పాల్గొన్నారు.

విద్యార్థి సంఘాల ర్యాలీ, ధర్నా

విద్యారణ్యపురి: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని పీడీఎస్‌యూ, ఏఐడీఎస్ఓ, డీఎస్‌ఏ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వరంగల్ ములుగు రోడ్డు వరకు ర్యాలీ తీసి ధర్నా నిర్వహించారు.

యాంటీ డ్రగ్స్‌పై అవగాహన

మడికొండ: 64వ డివిజన్ ఉనికిచర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యాంటీ డ్రగ్ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని పింగిళి మహిళా ప్రభుత్వ కళాశాల హనుమకొండ ఎన్ఎస్ఎస్ యూనిట్ –1 కేడెట్లు సోమవారం నిర్వహించారు. ఈ మేరకు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ వరంగల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్యామ్‌సుందర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మానవ అక్రమ రవాణా, బాల కార్మిక వ్యవస్థను అరికట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కవిత, రత్నమాల, డాక్టర్ మమత, హెచ్ఎం శ్రీనివాసరావు, ఎస్సైలు సుధాకర్, భాగ్యలక్ష్మి, పోలీసు సిబ్బంది రామారావు పాల్గొన్నారు.

మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు నివాళి

మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని నగర వ్యాప్తంగా ఇంజనీర్స్ డే వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సమాజ నిర్మాణంలో ఇంజనీర్ల పాత్రను పలువురు వక్తలు కొనియాడారు.

\- సాక్షి నెట్‌వర్క్



కేయూ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీర్స్ డే వేడుకల్లో అధ్యాపకులు, విద్యార్థులు



వరంగల్ పాలిటెక్నిక్ కళాశాలలో గ్రాడ్యుయేట్ సర్టిఫికెట్ అందజేస్తున్న ప్రిన్సిపాల్ బైరి ప్రభాకర్



హసన్‌పర్తిలోని వాసవి క్లబ్ ఆధ్వర్యంలో..



కాజీపేట రైల్వే ఎలక్ట్రిక్ లోకోషెడ్‌లో..

యువత రాజకీయంగా ఎదగాలి



హన్మకొండ: స్థానిక ఎన్నికల్లో ముదిరాజ్ యువత పోటీ చేయాలని ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ తెలంగాణ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. జవహర్ కాలనీలోని మెపా కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో మెపా యువత 8వ డివిజన్ కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా నర్ర దయాకర్, ప్రధాన కార్యదర్శిగా పులి మహేష్, కోశాధికారిగా పెద్దమ్మల రాకేష్, ముఖ్య సలహాదారుడిగా పులి లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులుగా గోనెల రాజన్‌బాబు, గోనెల శివరాజు, గంధపల్లి రాజేష్, గోనెల వీరప్రసాద్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

పింఛన్లు పెంచే వరకూ పోరాడుతాం



హసన్‌పర్తి తహసీల్ ఎదుట ధర్నా చేస్తున్న పింఛన్‌దారులు



ఖిలా వరంగల్ తహసీల్దార్ కార్యాలయం వద్ద..



కాజీపేట మున్సిపల్ సర్కిల్ కార్యాలయం ఎదుట..

హసన్‌పర్తి/ఖిలా వరంగల్/కాజీపేట: పింఛన్లు పెంచే వరకూ పోరాటాలు కొనసాగిస్తామని వికలాంగుల హక్కుల పోరాట సమితి, చేయూత పెన్షన్‌దారుల హక్కుల పోరాట సమితి, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు హెచ్చరించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆదేశాల మేరకు హసన్‌పర్తి, ఖిలా వరంగల్, కాజీపేట తహసీల్దార్ కార్యాలయాల ఎదుట సోమవారం ధర్నా చేశారు. మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా వికలాంగులకు రూ.6 వేలు, చేయూత పింఛన్లు రూ.4 వేలకు పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు.